# ప్రజల చెంతకు వైద్యం

- త్రిపురారం మండలంలో 8 పల్లె దవాఖానలు
- ప్రజారోగ్యంపై ప్రభుత్వం దృష్టి



అప్పలమ్మగూడెంలోని పల్లె దవాఖాన

త్రిపురారం, అక్టోబర్ 13 : రాష్ట్ర ప్రభుత్వం పల్లె చెంతకు వైద్య సేవలు తీసుకురావాలని పల్లె దవాఖానల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ప్రతి మూడు, నాలుగు గ్రామాలకు ఒక పల్లె దవాఖానను నిర్మించి అందుబాటులోకి తీసుకొచ్చింది. దీంతో ప్రజలు చికిత్స కోసం పట్టణాలకు పోయే బాధ తప్పింది. త్రిపురారం మండలంలోని పలు గ్రామాల్లో పల్లె దవాఖానలు మంజూరు కాగా ఇప్పటికే అప్పలమ్మగూడెంలో ప్రారంభించారు.

## ప్రజారోగ్యంపై ప్రభుత్వం దృష్టి...

గ్రామాల్లో ప్రతి ఏఎన్ఎం సెంటర్ వద్ద వారంలో మూడు రోజులు గర్భిణులు, బాలింతలు, టీబీ పేషెంట్లకు మందులు అందించాల్సి ఉండగా ఇబ్బందులు పడకూడదన్న నేపథ్యంలో ప్రభుత్వం గ్రామాల్లో పల్లె దవాఖానలను ఏర్పాటు చేయడం జరిగింది. గ్రామపంచాయతీల్లో, ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న ఏఎన్ఎం సెంటర్లకు ప్రత్యేక డాక్టర్లను నియమించి రోగులను మెరుగైన వైద్య సేవలు అందేలా ఆరోగ్య శాఖ చర్యలు చేపట్టింది.

## మండలంలో 8 పల్లె దవాఖానలు


మాటూరులో నిర్మిస్తున్న పల్లె దవాఖాన

త్రిపురారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో అప్పలమ్మగూడెం పల్లె దవాఖానను ప్రారంభించుకోగా బొర్రాయిపాలెం, మాటూరు గ్రామాల్లో భవనాలు నిర్మిస్తున్నారు. రాగడప, త్రిపురారం, అంజనపల్లి గ్రామాల్లో త్వరలోనే భవనాలు నిర్మించనున్నారు. పెద్దదేవులపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో పెద్దదేవులపల్లి, కామారెడ్డిగూడెం, గజలాపురం గ్రామాల్లో పల్లె దవాఖానలు మంజూరైనట్లు వైద్యాధికారులు చెబుతున్నారు.

### ప్రజలకు మెరుగైన వైద్య సేవలు



గ్రామాల్లో పల్లె దవాఖానాలను ఏర్పాటు చేయడం ద్వారా ఎప్పటికప్పుడు ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించవచ్చు. ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లి ప్రైవేట్ దవాఖానల్లో డబ్బులు వృథా చేయాల్సిన అవసరం ఉండదు.

– రమావత్ శంకర్, డాక్టర్

## రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు గురుకుల విద్యార్థి


నాగరాజును అభినందిస్తున్న ప్రిన్సిపాల్ వెంకట్‌రెడ్డి

నిడమనూరు, అక్టోబర్ 13 : ఈ నెల 16 నుంచి సంగారెడ్డి జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు అండర్ -19 విభాగంలో వేంపాడు శివారులోని అనుముల బాలుర మైనార్టీ గురుకుల పాఠశాల విద్యార్థి నాగరాజు ఎంపికయ్యాడు. ఈ మేరకు నాగరాజును పాఠశాలలో ప్రిన్సిపాల్ పాశం వెంకట్‌రెడ్డి అభినందించారు. ఉత్తమ ప్రతిభను ప్రదర్శించి పాఠశాలకు పేరు తీసుకురావాలని సూచించాడు.


బాలకృష్ణను సన్మానిస్తున్న రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గంప గోవర్ధన్

## తెలంగాణ రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా బాలకృష్ణ

హాలియా, అక్టోబర్ 13 : తెలంగాణ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా పేలవుడి బాలకృష్ణను శుక్రవారం సూర్యాపేటలో జరిగిన సమావేశంలో నియమించారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంప గోవర్ధన్ ఆయనను సన్మానించారు. బాలకృష్ణ నియామకంపై నల్లగొండ జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చిట్టిపోలు యాదగిరి, కరుణసాగర్, రమేశ్, బాలాజీ వెంకన్న, శేఖర్, యాద ఈదయ్య హర్షం వ్యక్తం చేశారు.

## బీఆర్ఎస్ బూత్ కమిటీల నియామకం

హాలియా, అక్టోబర్ 13 : మండలంలోని కొత్తపల్లి, పంగవానికుంటలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో బీఆర్ఎస్ బూత్ కమిటీలను నియమించారు. ఈ సందర్భంగా పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఎన్నమల్ల సత్యం మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీ నాయకుల తప్పుడు ప్రచారాలను ఎప్పటికప్పుడు తిప్పికొడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ఓటర్‌ను పోలింగ్ బూత్ దాక తీసుకుపోయి ఓటు వేయించాల్సిన బాధ్యత బూత్ కమిటీ సభ్యులదేనని అన్నారు. సమావేశంలో ఎంపీటీసీ వెంకటయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఉత్తూరి శ్రీనివాస్‌రెడ్డి, మండల యూత్ నాయకుడు పంగ లక్ష్మణ్ యాదవ్ పాల్గొన్నారు.


అనుములలో సీజ్ చేసిన మద్యాన్ని చూపుతున్న ఎస్ఐ శోభన్‌బాబు

## బెల్ట్‌షాపులపై దాడి..

- రూ.35 వేల మద్యం స్వాధీనం

హాలియా, అక్టోబర్ 13 : హాలియా మున్సిపాలిటీ పరిధిలోని అనుములలో గుంటుక శివారెడ్డి, గుర్రం శ్రీనివాస్‌రెడ్డికి చెందిన బెల్ట్‌షాపులపై గురువారం రాత్రి హాలియా ఎస్ఐ శోభన్‌బాబు సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టారు. రూ.35 వేల విలువ గల మద్యం బాటిళ్లను సీజ్ చేసినట్లు తెలిపారు.

## ఆధారాలు లేకుండా నగదు తీసుకెళ్లొద్దు

సూర్యాపేట, అక్టోబర్ 13 : ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రకారం ఒక వ్యక్తి రూ.50 వేలు మాత్రమే తన వెంట తీసుకెళ్లేందుకు అనుమతించడం జరుగుతుందని, అధిక నగదు ఉన్నప్పుడు ఆధారాలు తప్పక ఉంచుకోవాలని కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిబంధనలు అతిక్రమించి ఎక్కువ మొత్తంలో నగదు దొరికితే ఆ మొత్తాన్ని సీజ్ చేసి జిల్లా ట్రెజరీలో జమ చేస్తారన్నారు. రూ.10 లక్షలకు పైగా నగదు పట్టుబడితే విడుదల కోసం సంబంధిత ఆదాయపు పన్ను అధికారులకు తెలియపరిచి నగదు విడుదల కోసం నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోబడుతాయని వెల్లడించారు. అత్యవసరంగా వైద్యం, కళాశాల ఫీజులు, వ్యాపారం, పెళ్లిలు ఇతర అవసరాలకు నగదును తీసుకెళ్లేవారు సరైన పత్రాలతో నగదు తీసుకెళ్లాలని సూచించారు. అధికారులకు ఆధారాలుగా నగదు డ్రా చేసిన అకౌంట్ పుస్తకం లేదా ఏటీఎం చిటీ, వస్తువులు, ధాన్యం విక్రయ నగదు అయితే సంబంధిత బిల్లులు, భూమి విక్రయించిన నగదు అయితే డాక్యుమెంట్లు, వ్యాపారం సేవల నగదు అయితే లావాదేవీల వివరాలు చూపించాల్సి ఉంటుందన్నారు. నగదు విషయమై దరఖాస్తు చేసుకోవడానికి కలెక్టరేట్‌లోని మొదటి అంతస్తులో ఎఫ్-12 రూమ్‌లో జిల్లా గ్రీవెన్స్ కమిటీ కార్యాలయం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న గురుకులాల సొసైటీ అదనపు కార్యదర్శి హనుమంత్‌నాయక్

## చదువుతో పాటు క్రీడల్లో రాణించినప్పుడే గుర్తింపు

- గురుకులాల సొసైటీ అదనపు కార్యదర్శి హనుమంత్‌నాయక్
- గురుకులాల జోనల్ క్రీడాపోటీలు ప్రారంభం

తుంగతుర్తి, అక్టోబర్ 13 : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించినప్పుడే గుర్తింపు లభిస్తుందని సాంఘిక సంక్షేమ గురుకులాల అదనపు సొసైటీ కార్యదర్శి హనుమంత్‌నాయక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకులంలో నిర్వహిస్తున్న 9వ జోనల్ క్రీడలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. జిల్లా నలు మూలల నుంచి సుమారు 800 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈ 16 వరకు వివిధ స్థాయిల్లో జరిగే పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులతో పాటు ప్రశంసాపత్రం అందజేయనున్నట్లు చెప్పారు. విద్యార్థుల మార్చ్ ఫాస్ట్ అందరిని ఆకట్టుకున్నది. కార్యక్రమంలో ఏఓ అరుణకుమారి, ఎంపీడీఓ భీమ్‌సింగ్‌నాయక్, నవీన్, అనూష, రవి, గురుకులం సిబ్బంది, క్రీడాకారులు పాల్గొన్నారు.

## బైక్ డిక్కీలోని రూ.57 వేలు మాయం

మోత్కూరు, అక్టోబర్ 13 : బైక్ డిక్కీలో పెట్టిన నగదును గుర్తు తెలియని వ్యక్తి అపహరించిన ఘటన శుక్రవారం మోత్కూరు పట్టణంలో జరిగింది. మండలంలోని దత్తప్పగూడెంకు చెందిన పద్మయ్య తన కుమారుడు విజయకుమార్‌తో కలిసి పట్టణంలోని రిజిస్ట్రేషన్ కార్యాలయానికి రిజిస్ట్రేషన్ కోసం వచ్చారు. అక్కడే బైక్‌ను నిలిపి సమీపంలో ఉన్న డ్యాక్‌మెంట్ రైటర్ వద్దకు వెళ్లి వివరాలు తెలుసుకుని వచ్చేలోపే బైక్ డిక్కీలో పెట్టిన రూ.57 వేలను గుర్తు తెలియని వ్యక్తి డిక్కీ తాళం తీసి అందులో ఉన్న నగదును చోరీ చేసినట్లు బాధితులు వాపోయారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఫిర్యాదు మేరకు విచారణ జరుపుతున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

## తండ్రిని చంపిన కొడుకుకు రిమాండ్

పెద్దవూర, అక్టోబర్ 13 : తండ్రిని చంపిన కొడుకుని రిమాండ్‌కు తరలించినట్లు నాగార్జున సాగర్ సీఐ కె.బీసన్న తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. పోతునూర్ గ్రామానికి చెందిన బొడ్డు రాజాబాబు లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. 5 సంవత్సరాల క్రితం భార్యతో గొడవ పడి గ్రామంలో తల్లిదండ్రులతో ఉంటున్నాడు. తరచూ తల్లిదండ్రులతో కూడా గొడవ పడేవాడు. ఈనెల 11న తండ్రి వెంకటయ్యతో గొడవకు దిగి రాయితో దాడి చేయడంతో హైదరాబాద్‌లోని గాంధీ దవాఖానలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. రాజాబాబును రిమాండ్ పంపినట్లు సీఐ తెలిపారు.

## విద్యుదాఘాతంతో రైతు మృతి

పెద్దవూర, అక్టోబర్ 13 : పెద్దవూర మండలంలోని పోతునూర్‌లో శుక్రవారం విద్యుదాఘాతంతో రైతు మృతి చెందాడు. గ్రామస్తులు, ఎస్ఐ అజ్మీర రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. పోతునూర్‌కు చెందిన పెండ్యల నర్సింహారావు(67) శుక్రవారం సాయంత్రం తన వ్యవసాయ బావి వద్ద మోటార్ ఆన్ చేయడానికి వెళ్లాడు. ట్రాన్స్‌ఫార్మర్‌పై ఫీజ్ వైర్ తెగిపోవడంతో సరి చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. మృతుడు భార్య పెండ్యల సుమతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## కొండగడప విద్యార్థినికి గోల్డ్ మెడల్


గవర్నర్ తమిళిసై చేతుల మీదుగా గోల్డ్ మెడల్ అందుకుంటున్న స్వాతి

మోత్కూరు, అక్టోబర్ 13 : మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని కొండగడప కు చెందిన దొండ స్వాతి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ(హెచ్‌సీయూ) నుంచి ఎంఏ తెలుగు విభాగంలో గోల్డ్ మెడల్ సాధించింది. శుక్రవారం యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ తమిళిసై చేతుల మీదుగా గోల్డ్ మెడల్ అందుకున్నారు.